క్లుప్తంగా

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి



శుక్రవారం ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

హయత్‌నగర్: ముస్లింలకు అతి పవిత్రమైన పండుగ రంజాన్‌ను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని హయత్ నగర్ మైనార్టీ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. చారిత్రాత్మకమైన హయత్‌బక్షీ మసీద్‌లో సుమారు మూడు వేల మంది రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు వీలుగా తీర్చిదిద్దారు. శుక్రవారం జరిగిన రంజాన్ చివరి శుక్రవారం (జమాత్ ఉల్ విదా) ప్రార్థనల్లో స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఏసీపీ పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు విద్యార్థులు కృషి చేయాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి పట్టుదలతో కృషి చేయాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆమె డివిజన్ పరిధిలోని సరళా హట్స్ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో మనబస్తీ–మన బడి కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, పాఠ్యాంశాలను కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో చార్మినార్ డీపీ నెహ్రూ బాబు, సైదాబాద్ డిప్యూటీ డీఈఓ రాధాకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ హరిబాబు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ హయత్‌నగర్ ఉపాధ్యక్షుడిగా గట్ల రవీంద్ర



రవీంద్రను సన్మానిస్తున్న జితేంద్రకుమార్

దిల్‌సుఖ్‌నగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ హయత్‌నగర్ డిస్ట్రిక్ట్ 320సి ఉపాధ్యక్షుడిగా ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన గట్ల రవీంద్ర (హైటెక్ రాము) నియమితులయ్యారు. లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ గార్లపాటి జితేంద్ర కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పడింది. నూతన కార్యవర్గంలో జోన్ చైర్మన్‌గా పెండం కృష్ణకుమార్, అధ్యక్షుడిగా చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గట్ల రవీంద్ర, కార్యదర్శిగా జి. సంతోష్ కోశాధికారిగా అశోక్ కుమార్‌లను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. ల యన్స్ క్లబ్ ప్రతినిధులు శంకర్, భార్గవ రాజు, లింగారెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

భజన పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రమణాచారి

వనస్థలిపురం: నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరి స్వామి యాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మే 9 నుంచి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. భజన పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి తన నివాసంలో ఆవిష్కరించారని ఆయన తెలిపారు. ఉత్తమ గాయకుడు, హార్మోనిస్టు, తబలిస్టుకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 9948241188 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బోర్లకు వెంటనే మరమ్మతు చేపట్టాలి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలో పాడైన పవర్, హ్యాండ్ బోర్లకు వెంటనే మరమ్మతు చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అధికారులను కోరారు. హయత్‌నగర్ పరిధి బృందావన్ కాలనీలో నూతనంగా ఎన్నికైన కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి కార్పొరేటర్ కాలనీలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని, చర్యలు చేపడతానని అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు కొదండ సురేష్, పారంద మహేష్,యశోద, అర్జున్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, విజయ్, శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.


చల్లదనం.. ఆరోగ్యం!



మార్కెట్‌లో విక్రయిస్తున్న పుచ్చకాయలు



బంగినిపల్లి మామిడి పండ్లు



మస్క్ మిలాన్ (ఖర్బూజ)



ద్రాక్ష

- పుచ్చ, ఖర్బూజ, ద్రాక్ష పండ్లతో అధిక ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం
- మార్కెట్‌లో అందుబాటులో పలు రకాల పండ్లు
- వేసవిలో పండ్లకు పెరిగిన గిరాకీ

చైతన్యపురి: వేసవి సీజనల్ వచ్చే పండ్లను తినడం వల్ల అధిక ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనంతో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. వేసవి కాలంలో ముఖ్యంగా పుచ్చకాయ, తాటిముంజలు, మస్క్‌మిలన్ (ఖర్బూజ), మామిడి పండ్లు, ద్రాక్ష, ఖర్బూజ వంటి వాటికి మంచి గిరాకీ ఉంటుంది. సామాన్యులకు సైతం అందుబాటులో ఉండటం వల్ల పుచ్చకాయలు ఎక్కువగా అమ్మకాలు జరుగుతుంటాయి.

- ప్రస్తుతం మార్కెట్‌లో వివిధ రకాల పండ్లకు మంచి డిమాండ్ ఉంది. వేసవి వేడిని తట్టుకోవటానికి ఈకాలంలో వచ్చే కొన్ని పండ్లు వరంలా ఉపయోగపడతాయి,
- వేసవిలో పండ్లు రుచితో పాటు శరీరానికి చలువ చేస్తుందని వైద్యులు సూచిస్తుంటారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ బారిన పడకుండా ఉండాలంటే పండ్లను వినియోగించాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

మార్కెట్ తరలించినా తగ్గని వ్యాపారాలు..

- కొత్తపేటలోని గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌ను తరలించినప్పటికీ చిరు వ్యాపారులు మాత్రం ఇక్కడే ఉండి తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఇప్పటికీ రకరకాల ఫలాలకు కేరాఫ్‌గా కొత్తపేట అనే చెప్పవచ్చు.
- ఎల్‌బీనగర్, నాగోలు, దిల్‌సుఖ్‌నగర్, సరూర్ నగర్, చైతన్యపురి, మలక్‌పేట పరిసర ప్రాంతాల నుంచి పండ్లు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఇక్కడికే వస్తుంటారు. ప్రస్తుతం మామిడి, పుచ్చకాయలు, ఖర్బూజ, ద్రాక్ష, ఆపిల్, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, కివి, అనాస, పనస అందుబాటులో ఉన్నాయి.
- బంగినపల్లి మామిడి పండ్లు కిలో 70 నుంచి 100 రూపాయలు, చిన్న రసాలు రూ.100–120, సురేఖ రసాలు రూ.100, ద్రాక్ష రూ. 60, ఆపిల్ ఒక్కోటి రూ. 30, దానిమ్మ ఒక్కోటి రూ. 20 నుంచి 35 వరకు, కివి పండ్లు రూ 100కి నాలుగు చొప్పున విక్రయిస్తున్నారు. పుచ్చకాయలు కేజీ రూ.15, బొప్పాయి కేజీ రూ.10 చొప్పున మార్కెట్‌లో లభ్యం అవుతున్నాయి.

ధరలు పెరగలేదు



గడ్డిఅన్నారం మార్కెట్ ఇక్కడ నుంచి తరలించినప్పటికీ ఇక్కడే వ్యాపారాలు సాగిస్తున్నాం. ముప్పై సంవత్సరాలుగా బండ్లగూడ నుంచి ఇక్కడకు వచ్చి పండ్లు విక్రయించి జీవనం సాగిస్తున్నాం. పండ్ల మార్కెట్ ప్రస్తుతం ఇక్కడ లేకపోయినా మా వ్యాపారాల్లో తేడా ఏమీ లేదు. గతేడాదితో పోల్చితే పండ్ల ధరల్లో మార్పులేదు.

– కమలమ్మ, పండ్ల వ్యాపారి

ఫ్లవర్ పార్కు ఏర్పాటుకు మార్గం సుగమం: ఎమ్మెల్యే



జీహెచ్‌ఎంసీ కమిషనర్, శ్రీభవానీ ఎంటర్ ప్రైజెస్ సంస్థ సభ్యులతో సమావేశమైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: డంపింగ్ యార్డ్ స్థలంలో అంతర్జాతీయ ఫ్లవర్ పార్కు ఏర్పాటుకు అన్ని అడ్డుంకులు తొలగిపోయి మార్గం సుగమం అయ్యిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సత్యనారాయణ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, శ్రీభవానీ ఎంటర్ ప్రైజెస్ సంస్థ సభ్యులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శుక్రవారం సమావేశమై పార్కు ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీభవానీ ఎంటర్ ప్రైజెస్ సంస్థ పెట్టిన కేసును వెనక్కి తీసుకోవడానికి ముందుకు రావడం శుభ పరిణామం అని అన్నారు. సంబంధిత పత్రాలను కోర్టుకు సమర్పిస్తామని ఆ సంస్థ సభ్యులు తెలిపారన్నారు. 18 ఏళ్ల క్రితం డంపింగ్‌యార్డ్‌ను ఎత్తివేస్తామని జీహెచ్‌ఎంసీకి ఆ సంస్థ తెలిపిందని, నేడు ఎత్తివేతకు మోక్షం లభించడం సంతోషకరమని అన్నారు. అదనంగా మరికొన్ని ఏజెన్సీలను చేర్చి పనులను త్వరగా చేపట్టి పూర్తి చేస్తామన్నారు. రాబోయే నాలుగు నెలల్లోగా డంపింగ్‌యార్డ్‌ను ఎత్తి వేస్తామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతమైన ఫ్లవర్ పార్కును నిర్మించి దేశం నలుమూలల నుంచీ సందర్శకులు వచ్చేలా పార్కును ఏర్పాటు చేస్తామన్నారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

నాగోలు: డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్లు, డ్రైనేజీ సమస్యలు, స్ట్రీట్ లైట్స్, వాటర్ సమస్యలు వెంటనే పూర్తి చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్ర్ యాదవ్ అధికారులకు సూచించారు. శుక్రవారం నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీలో పారిశుద్ధ్యం, ఇతర సమస్యలపై రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, జలమండలి అధికారులు, వివిధ డిపార్ట్‌మెంట్ల అధికారులు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యల పరిష్కారానికి సహకరించాలి



అధికారులకు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్ రెడ్డి డివిజన్‌లోని పలు కాలనీల్లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి సర్కిల్ సిబ్బంది సహకరించాలని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారులను కోరారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటెన్సివ్ శానిటేషన్ అండ్ ఆర్‌డబ్ల్యూఏ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సర్కిల్ అధికారులు, సిబ్బంది డివిజన్‌లో పర్యటించి డ్రైనేజీ, రోడ్లు, శానిటేషన్, వీధి దీపాలు, తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమానికి హాజరైన మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ, సర్కిల్ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో కొన్ని కాలనీల్లో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయని, లోప్రెషర్ తాగునీటి సరఫరా వంటి సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సర్కిల్ డీఈ దామోదర్‌రావు, వాటర్ వర్క్స్ మేనేజర్ వాహిని, ఎంటమాలజీ సిబ్బంది నరేందర్‌రెడ్డి, ట్రాన్స్‌కో సిబ్బంది జానికీరామ్, భానుప్రకాష్, సంజీవరెడ్డి, కాలనీ స ంక్షేమ సంఘ ప్రతినిధులు తిరుమలేష్, బాల నర్సింహా, అశోక్, లక్ష్మణ్, గట్టయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలి



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ హరిపురికాలనీలోని విబ్జియార్ ఉన్నత పాఠశాల 14వ వార్షికోత్సవాన్ని శుక్రవారం పాఠశాల ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి మాట్లాడుతూ టీవీ, సినిమా, సోషల్ మీడియా ప్రభావం విద్యార్థులపై అధికంగా ఉంటుందన్నారు. ప్రస్తుత సమాజంలో విలువలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ లింగారెడ్డి మాట్లాడుతూ, నాణ్యమైన విద్యకు తమ పాఠశాల చిరునామాగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాథ్‌సే హాథ్ జోడో యాత్రను విజయవంతం చేయండి



సమావేశంలో ప్రసంగిస్తున్న చల్లా నర్సింహారెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో హాథ్‌సే హాథ్ జోడో యాత్రను చేపట్టి విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరరెడ్డి అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు అందరూ కృషి చేయాలని కోరారు. నాయకులంతా వ్యక్తిగత విభేదాలు పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి సంకెపల్లి సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి, సదాశివుడు, మల్లారం శ్రీనివాసరావు, కుట్ల నరసింహయాదవ్, శ్రీపాల్‌రెడ్డి, కొషోర్‌గౌడ్, మంజులరెడ్డి, స్వర్ణమాధవి, రమేష్‌నాయక్, రాజశేఖర్, బండ సురేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వేణుయాదవ్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు విన్నవించిన ఇందిరానగర్ వాసులు

మలక్‌పేట: మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి శుక్రవారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో పర్యటించారు. కాలనీవాసులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా గుడి ముందు కొత్తరోడ్డు, కమ్యూనిటీహాల్‌పై మొదటి అంతస్తు, పాడైపోయిన బోర్‌మోటర్ తీసివేయాలని, స్ట్రీట్ లైట్లు, స్ట్రీట్ లైట్లకు అడ్డం వస్తున్న చెట్ల కొమ్మలు తొలగించాలని అధికారులను కోరారు. అనంతరం కాలనీవాసులతో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ..చిన్న చిన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అవసరమైన కొత్త పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ బన్సీలాల్‌కుమార్, జలమండలి ఈఏ చంద్రునాయక్, సెక్టార్ ఎస్సై మణికంఠరాజు, ఎంటామాలజీ గుండప్ప, శానిటేషన్ జవాన్ రమేష్, హార్టికల్చర్ రవి, స్ట్రీట్ లైట్స్ డీఈఈ రాజు పాల్గొన్నారు.

ఘనంగా అష్టలక్ష్మీ ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అమ్మవారి పల్లకీ సేవ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయ 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గారిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ఆలయ ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి ఐతే అంజయ్య గుప్తా, బ్రహ్మోత్సవాల కమిటీ కన్వీనర్ గారిశెట్టి అరుణ్, ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్ పాల్గొన్నారు.

నేటి పూజలు...

అష్టలక్ష్మీ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణ, భేరిపూజ, దేవతాహ్వానం, సర్వవ్యాధి నిర్మూలన కోసం శ్రీసుదర్శనేష్టి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

నాగోలు: కొత్తపేట డివిజన్‌ను ఆనుకొని మూసీ నది ప్రవహిస్తుండటం వల్ల దోమలు అధికమై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ శుక్రవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతి ప్రతం అందజేశారు. దోమల మందు కొట్టే వాహనాలు రెండే ఉండటం వల్ల అన్ని కాలనీల్లో దోమల నివారణ సాధ్యం కావడంలేదని, అదనంగా వాహనాలను సమకూర్చాలని కోరారు. అలాగే, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని కొత్తపేట డివిజన్ పరిధిలో నూతన సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

చైతన్యపురి: వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని రవీంద్ర ఆసుపత్రి చైర్మన్ రవీందర్ అన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు యాద శంకర్ కురుమ ఆధ్వర్యంలో చైతన్యపురి బస్టాప్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌కుమార్, బిచినేపల్లి వెంకటేశ్వరరావు, రమేష్ ముదిరాజ్, జక్కుల శ్రీశైలంయాదవ్, ఆనంద్‌గౌడ్, బాలాగౌడ్, సన్నీయాదవ్, విక్కీ, బాలసుందరం, మల్లిక, శైలజ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

తేజస్వి కుటుంబానికి ఎంపీ అరవింద్ పరామర్శ



తేజస్వి తండ్రి శశిధర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ ధర్మపురి అరవింద్

సైదాబాద్: యూకేలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన విద్యార్థిని తేజస్వి కుటుంబ సభ్యులను ఎంపీ ధర్మపురి అరవింద్ పరామర్శించారు. శుక్రవారం సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలోని ఆమె ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు జ్యోతి, శశిధర్‌రెడ్డిలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. యూకే నుంచి తేజస్వి భౌతిక ఖాయాన్ని తెప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. తేజస్వి గతేడాది సెప్టెంబర్‌లో యూకేలోని క్రాన్‌ఫీల్డ్ వర్సిటీలో ఎంఎస్ చేసేందుకు వెళ్లి ఈనెల 11న అక్కడి బీచ్‌లో ప్రమాదవశాత్తూ అలల్లో చిక్కుకొని మృతి చెందింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవతో శుక్రవారం రాత్రి వరకు తేజస్వి మృతదేహం నగరానికి చేరుకుంటుందని బంధువులు తెలిపారు. ఎంపీ వెంట ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు యాదవ్ ఉన్నారు.

వాటర్ లీకేజీలకు చెక్ పెట్టేందుకు చర్యలు



లీకేజీ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: డివిజన్‌లో వాటర్ లీకేజీలు, కలుషిత నీటి సరఫరా సమస్యలకు చెక్ పెట్టడానికి తగిన చర్యలు చేపట్టినట్లు మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆండాళ్ నిలయం సమీపంలో శుక్రవారం జరుగుతున్న పైప్‌లైన్ లీకేజ్ మరమ్మతు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా నీటిని సరఫరా చేయాలని అన్నారు. వాల్వ్ వద్ద లీకేజీ, పైప్‌లైన్ లీకేజీలు మళ్లీ ఏర్పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ రమేష్, ఎస్‌ఎఫ్‌ఏలు, వాటర్ వర్క్స్ సిబ్బంది ఉన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు



సాయిగంగా కాలనీలో చేతి పంపును పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

సైదాబాద్: వేసవికాలంలో సైదాబాద్ డివిజన్‌లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలో పర్యటించారు. పలుచోట్ల చేతి పంపులు సరిగా పనిచేయట్లేదని స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. సాయిగంగా కాలనీలో సహా డివిజన్ పరిధిలోని చేతి పంపులకు మరమ్మతులు చేయించాలని వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో ఎక్కడైనా తాగునీటి సరఫరాలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ శ్రవణ్‌కుమార్, అశోక్‌గౌడ్, దర్శన్, వాజీద్, కిషోర్, అరవింద్ పాల్గొన్నారు.

10 ప్రైవేట్ బస్సులు సీజ్



టాఫిక్ పోలీసులు సీజ్ చేసిన బస్సులు

మలక్‌పేట: ప్రైవేట్ బస్సులు నిబంధనలు అతిక్రమించి నగరంలోకి ప్రవేశిస్తే సీజ్ చేస్తామని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నగరంలోని ప్రవేశించిన 10 ప్రైవేట్ బస్సులను సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7 వరకే ప్రైవేట్ బస్సులు, భారీ వాహనాలకు సిటీ లోపలికి రావడానికి అనుమతి ఉందన్నారు. రూల్స్ బేఖాతర్ చేసిన వాహనదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, సీజ్ చేసిన బస్సుల్లోని ప్రయాణికులను ఇతర వాహనాల్లో సిటీలోకి తరలించారు.

నైతిక విలువతో కూడిన విద్యాబోధన చేయాలి



సైదాబాద్: చిన్నారులకు నైతిక విలువలతో కూడిన విద్యాబోధన చేయాలని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. చంపాపేటలోని పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రీప్రైమరీ పూర్తి చేసి ప్రైమరీ తరగతులకు అర్హత సాధించిన చిన్నారులకు ఆయన పట్టాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ప్రీప్రైమరీ నూతన సిలబస్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్వొకేషన్ డే

వనస్థలిపురం: వనస్థలిపురంలోని నాగార్జున మాంటిసోరి, ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాలలో శుక్రవారం మాంటిసోరి విద్యార్థుల కాన్వొకేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. నల్ల గౌన్లు ధరించిన చిన్నారులు ప్రశంసా పత్రాలు అందుకొని సందడి చేశారు. ఈ సందర్భంగా నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ, చిన్నారులకు పాఠశాల పట్ల మక్కువ పెంచేందుకు పాఠశాలలో ప్లే వే పద్ధతిలో బోధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

